

# చుక్కలు

శ్రీ రామారావు.

అవి పెళ్ళయిన కొత్తరోజులు.

రాత్రి వెన్నెల బాగావుంది. కిటికీలోంచి గదిలోవున్న పందెరమంచముమీద పడుతూంది వెన్నెల. మంచంకోడికి జారబడి తివ్వాసీమీద కూచున్నాను. గది అంతా నిశ్శబ్దం.

ఆయన యింకా రాలేదు. ఆయనకోసం మనసు ముందుకు లాగుతోంది. అక్కడికి నా మనస్సాక్క రెండు మూడుమార్లు గుమ్మంలోకి వెళ్ళి అటూయిటూ చూచాను. ఎక్కడా అలికిడే లేదు. గత మూడు రాత్రులు నిద్దరలేక పోవడంచేత కన్నులు మాత్రం మూతపడుతున్నాయి.

హృదయం, శరీరం మాత్రం అతనికోసం, స్వాతివానకి ముత్త్యపు చిప్పలవలె, యెదురు తెన్నులు చూస్తూన్నాయి. గోడనున్న గడియారం టంగు టంగని పదకొండు కొట్టింది. ఆయన యింకా రాలేదు. నాకు నిద్దర ఆగిందికాదు. లేచి మంచంమీద, గోడవారీగా తిరిగి పండుకున్నాను.........కాని, నిద్ర రాదుగా! ఎందుకొస్తుంది? జరిగిపోయిన మూడు రాత్రుల్లు జ్ఞాపకం వస్తూన్నాయి......మనసు రగులుతుంది, శరీరపు దాహం యెక్కువై పోతుంది, ఆయన యింత రాత్రి వరకు యెక్కడకు వెళ్లారు?

తలుపు చప్పుడైంది.

ఉలిక్కిపడి లేచాను. కనురెప్పలు విడ్డాయి కావు. బలవంతంగా చేతుల సహాయంతో చూచాను. పిల్లి మెల్లగా బల్లమీదనున్న పాలు కాజేస్తుంది. దానికి వేళయినట్లుంది. తలుపు దగ్గరా జేరేసి మళ్ళి వచ్చి పండుకున్నాను.

చిన్నప్పటి సంగతులన్నీ జ్ఞాపకమునకు వస్తున్నాయి ...... ఆటల్లో, పాటలలో యెంత ఆనందం పొందేవాళ్ళం! రహీంచాలా సరదా అయినవాడు. యెపుడు నవ్విస్తూ నన్నంటి పెట్టుకొనే వుండేవాడు. ఓనాడు అతను తాగిన మంచి నీళ్ళు నే తాగితే అమ్మయెందుకో కోపం చేసింది. అపుడు దాని అమ్మాయి వూరికే పెహాలేదు... అబ్బా! ఆ చిన్ననాటి జీవితం యెంత మాధుర్యం వుంది. అప్పుడే యింతలోనే యింతలోనే యీ నా జీవితం యెంత మారిపోయింది!

మళ్ళి కొంత సేపటికి అలికిడైంది. తిరిగి చూస్తే ఆయనే! మంచం మీదనుంచి గప్పున దూకాను. ఆయన నా రెండు చేతులు పట్టుకొని పక్కమీద కూర్చోబెట్టారు. నేను గోడవైపు తిరిగి పండుకున్నాను. నన్ను ఆయన వైపుకి త్రిప్పుకొని, లాక్కుని నా గులాబీ పెదవులమీద, ఆయన పట్టీ రంగు పెదవులతో ముద్దుపెట్టుకోబోయేరు. నాకేదో తీరని అసహ్యమేసింది. మనసు తిరిగిపోతుంది. ఆయన చేతులలోంచి, ఆ కావి లింతలలోంచి తప్పించుకోవాలని గిలగిల తన్నుకుపోయాను. ముఖం గోడవైపుకు తిప్పేశాను. ఆయన నా కుడి

రొమ్ముమీద మృదువుగా ముద్దు పెట్టుకొని, కావిలింత విడచిపెట్టారు. నా బాడీ, కోక అన్నీ సర్దుకొన్నాను. ఆయన ముఖం కందగడ్డలాగుంది. ఆ క్రాపింగు నున్నగా దువ్వి వుంది. నాకసహ్యా మేసింది. ఏమిటిదంత? ఏభోగం......................

..........పోయొచ్చాడు...... ఆయన గురించి మొదలునుంచీ చెప్పుకొంటూనే వున్నారు.......రసపిపాసుడని......నా కెంతో యేడుపొచ్చింది. కాని యేంచేయను? ఆయన నా మెడలో పుస్తె కట్టారు. ఇకనుండి ఆయన చెప్పు చేతులలో రబ్బరు బొమ్మవలె వుండాలి. ఆయనేంజేసినా పాతివ్రత్యానికి జడిసి, వూరుకోవాలి. లేకపోతే సంఘం దూషిస్తుంది, నీవు ప్రతివ్రతవు కావని. పెండ్లయిన నాటినుండి హిందూ స్త్రీ జీవితమంతా ఆ అపరిచిత వ్యక్తిమీద ఆధారపడివుండి ఆతనేలాంటివాడో, ఆతని భావాలేలాంటివో, ఆతని పద్ధతు లేమిటో, ఆతనివద్ద యేవిధముగా మసలాలో తెలియదు, తెలుసుకోవడానికి అవకాశం లేదు. ఇదివరకు ముఖమైన చూడని ఆ పురుషుని ఆ నాటినుండి, ఆ రాత్రినుండి, ప్రేమించాలి, కామించాలి, ఆయన చెప్ప చేతల్లో, వుంగరంవలె మెలగాలి. అది హిందూ స్త్రీ ధర్మమట!

ఆయన రాత్రిళ్లు రావడం నానాటికి ఆలస్యమవుతోంది. ఆయన వైఖరి చూస్తే నాకసహ్యం, భయం కూడా కలుగుతూంది. ఒక్క దానినీ ఆ పెద్ద మంచం మీద వెల్లకితలా పండుకొని తెల్లని ఛాందినీ మీద దోమల్నీ లెక్కిస్తూన్నాను. అలా వొంటరిగా వెల్లకితలా పండుకుంటే నా హృదయంలో కోర్కెలు శరీర రక్తం వుడుకెత్తేపోయేది. ఈ యన్నెందుకు యెనిమిది వేలు పోసి కొనుక్కుంది.

ఒక నాటి రాత్రి కొంచెం రసయుక్తంగానే, ఆయనకి దగ్గరగా చేరి మనస్సు బిగబెట్టుకొని, బలవంతంగా నా పెదవులు ఆయన చంపల దగ్గరికి పోనిచ్చాను. కాని పెదవులు ...... కదలవు ... యేలాగో అనిపించింది. "రాత్రుళ్లు...... ........రా......" అంతకంటె మాట పెగల్లేదు. ఆయన భుజం మీద వాలిపోయాను. దుఃఖం ఆగిందికాదు. ఏడ్చేను. ఆయన భుజమంతా తడిసిపోయింది, ఆయన నన్నెంతో నేర్పుతో, లాలిస్తో వూరడించారు.

ఆరోజు మొదలు పట్టీ వుచ్చుకొని, గదిబైట గొళ్ళెం పెట్టి తాళంవేసి చెవి జేబు రుమాలికి కట్టుకొని బయటికి వెన్నెలపికారు వెళ్ళే ఆయన ఇది యెంతదారుణం?

ఎనిమిదివేలు పెట్టి యీయన్ని కొనుక్కుంది యెందుకు? నన్నిట్లా గదిలోపెట్టి సీలుచేసి తాను పరస్త్రీతో ఆ భోగందానితో కులకడానికా? నావొళ్ళు మండిపోయింది ప్రేమ నేదియే కోశానాలేకుండా నా శరీరం- యేకూరా లేకపోతే ఆవకాయలా ఆయనకి కావలసినవుడు, ఆయన చెప్పుచేతల్లో ఆటవస్తువులా, రాయిలా, రాప్పలా, వప్పజెప్పడమేనా? ఆంతటితో......ఆ పదినిముషాలతో...తృప్తిపడ్డమేనా? ఇంతవరకు యేనాడు కళ్లతో ఐనా చూడని అపరిచిన వ్యక్తికి లోబట్టం అంటే యెంత హేయం, యెంత నీచం? యేమిటీ నిబంధనలు, కట్టుబాట్లూను? ఆకలేస్తే హోటల్లో భోంచేయడంలేదా? దాహం వేస్తే సోడా త్రాగడంలేదా? సంసార స్త్రీ గతికూడా అంతే నంటారా?

ఆయనకి నడుమునొప్పి వచ్చింది. ఇల్లుదాటి బయటకి వెళ్ళడంలేదు. ఉమ్మంటే పీకిదాన పెట్టీ, దొడ్డికంటే తొట్టిపెట్టీ ఆయనకి సేవ చేస్తున్నాను. ఎంతచేసినా కసరటం కొసరటమే; ఆయనకి తృప్తి అనేది లేదు నోటికివచ్చిన తిట్లన్నీ తిడతారు. ఒకొక్కఅప్పుడు నాకు చాలాకష్టం అనిపించేది. ఇట్లాంటి రోగిష్ఠితోటి, కోపిష్టితోటి పరస్త్రీ పొత్తున్న యీయనతో కలకాలం సుఖంగా జీవించేదెలా? అన్నిటికీ సహించి, భర్త గదాని యెంత తాపత్రయంతో సేవచేసినా రాత్రి ఆ భోగందాని మీదే కలవరింతలు. ఆలాంటప్పుడు నా మనస్సెలా వుంటుంది చెప్పండి?......ఒకొక్క అప్పుడు ప్రేమపొంగీ, వొళ్ళుమండీ; ఆయన యీలా జబ్బుతోనే వుంటే యెప్పుడూ నాకుకనిపిస్తో యిల్లయినా వదలకుండా వుంటారు. ఈ జబ్బు తగ్గకుండా వుండా లనిపించేది. కాని ...మళ్లా ఆయన...కావలి స్తే?

నానాటికీ ఆయనకాళ్ళు సన్నబడిపోతున్నాయి. నడుము పట్టు తప్పిపోయింది. శరీరంలో సత్తువ లేకుండా పోతోంది. జ్వరంకూడా తీవ్రంగానే వస్తుంది. నా చాకిరీ అంతకంతకి యెక్కువై పోతుంది

ఆయన తిట్లు కూడా నానాటికీ యెక్కువై పోతున్నాయి. నా ముఖంకేసి తేరబారి చూచి వుమ్మేస్తూన్నాడు, యేమీ చేయలేక అసక్తుడై నా అందం, ఆరోగ్యం చూచి వోర్వలేక కామోసు! ఆయనెందుకాలా భోగందాని దగ్గరికిపోయి ఆ జబ్బులు అంటించుకోవాలి? పరస్త్రీ స్పర్శకోరే పాపాత్ముని కింతకంటే శిక్షేంగావాలి? ప్రభుత్వం హత్యలు చేసేవారిక్కి, చేయించినవారికి వురిశిక్షలువేసి, ప్రాణాలుతీసి, పాపానికి ఒడికట్టుకుంటుంది, గాని అట్లాంటి నేరస్తుల్ని తీసుకుపోయి యీ భోగం స్త్రీలకు వొప్పచెప్పితే మంచిశిక్ష, జీవహింసలేనిశిక్ష తగుల్తుంది.

ఆయనకి జ్వరం నిమ్మళించింది. కాళ్ళు నడుంమాత్రం యింకాయథాస్థితిలోకి రావని డాక్టర్లు చెప్పారు. నాకు భయమేసింది. యిక నాగతేంగాను? మా తమ్ముని పెళ్లని మా అమ్మా నాన్నా వచ్చి తీసుకెళ్లారు. ఆయన తరువాత వస్తాన్నారు. తమ్ముడెంతో ఉత్సాహంగా వున్నాడు. తనక్కీ ఒక భార్య వస్తుందని ఆ సంసారం, ఆ సౌఖ్యం శాశ్వతం అనుకుంటున్నాడు. ఆ అపరిచిత స్త్రీనిబట్టి ఆతని జీవితం అంతా వుంటుందని వూహించుకోవడంలేదు పాపం!

స్నేహితులంతా నాలుగురోజులు ముందుగానే వచ్చారు. రెండు రోజులుపాటు ఆ పడకగదే అలంకరించారు. గుడ్డలులేని బొమ్మలతోనూ, కాంతిలేని దీపాలతోను.

రహీం చాలా అందగాడు. మంచి తెలుగు మాట్లాడుతాడు. తెలుగు పద్ధతుల మీదే తయారౌతాడు. మంచిరంగు, రంగుకుతగ్గా తేజస్సు తేజస్సుకు తగ్గా హృదయం ఆతన్ని ...ప్రే...మిం... చాను... తొలి చూపులోనే అతని ప్రేమకు పాత్రురాల్ని అయ్యాను. నాకో భర్త వున్నాడనీ, ధర్మశాస్త్రానుసారంగా అతన్కి అర్ధాంగిననీ, అతనుండగా మరొకర్ని ప్రేమించకూడదనీ, అధవా ప్రేమించినా పబ్లికుగా పెండ్లి చేసుకోవడానికి వీల్లేదనీ, అందుకు 'లా'సంఘం అంగీకరించదనినాకేమీ ఆ సమయంలో తెలియలేదు.

మేడమీదకు లాంతరుకోసం వెళ్లాను. అతను మడతకుర్చీలో కూచున్నాడు. యెంత ఠీవిగా కూర్చున్నాడంటారు! మొగల్ రాజసమంతా అప్పట్లో అతని ముఖంలో మూర్తీభవించిందా అనిపించింది. నాకేసి, నా అందంకేసి, నావుబుకు రొమ్ములకేసి, కన్ను మూయకుండా, ఆ చూపుల్లో యెంతో తాపత్రయం కనపరస్తూ, చూస్తున్నాడు. నాకే సిగ్గేసింది. కొంచెం కోపం కనపరుస్తో ఆతనివేపు తీక్షణంగా చూస్తూ నవ్వేశాను ఆవేళ నుండి, ఆ నిమిషంనుండి నా మీదమోజు యెక్కువై పోయింది.

రాత్రి వెన్నెలింకా రాలేదు. రాత్రయ్యేవరకు నా మనసు మననులోలేదు. ప్రతి రక్తనాళం రహీం కావాలని నన్ను కటకట కొరికేసే, ఆతనికోసం, కావాలని దారులు వెతికేవి. హృదయంల్లోంచి బయలు దేరే ఆతాపానిక్కీ, దాహానిక్కీ, తాళలేక పోయాను.

నేను మెల్లిగా, పిల్లిలా, మేడ మెట్లు యెక్కి హాలులోకి వెళ్లాను. వరసగా అంతా సినిమాకుపోయొచ్చి వడలు మరచి నిద్రపోతున్నారు ఆ గుంపులో రహీం యెక్కడున్నాడో! వెతకడం చాలాకష్టం, మీరైతే యెన్నిచిక్కులు పడేవాళ్ళో. నా కన్ను మాత్రం చాలా సూక్ష్మంగా కనుక్కోగలిగాయి. ఆ కడవాడే అతనని మట్టెలు గచ్చుకి తగిలి చప్పుడౌతున్నాయని తీసేసి దొడ్డిలోకి విసిరేశాను. మెల్లిగా దగ్గరగావెళ్ళి ముసుగు తొలగించాను. అతను బెదురుతూ నావేపు చూచాడు. మాటలాడవద్దని సైగచేశాను. నాతో లేచి బైటకి చక్కావచ్చాడు. ఇద్దరం ఆ మంచులో, చీకట్లో 'బాల్కనీ' లో పిట్టగోడమీద కూచుని కబుర్లు చెప్పుకున్నాం చిన్ననాటి ముచ్చట్లన్నీను. మావూళ్లో రహీం తండ్రి తాసిల్దారీ చేసినపుడు రహీం మాతో చదువుకున్నాడు. అప్పటి నుండీ, రహీం చాలా తెలివైనవాడనీ, మంచి మనసుకలవాడనీ, స్నేహపాత్రుడని నా హృదయ ఫలకంలో చిత్రించబడింది. చిన్ననాటి కబుర్లన్నీ చెప్పాడు, ఓపిగ్గా మరిచిపోకుండా. ఓనాడు మా అమ్మ దగ్గర నేకుండగా రహీం నన్ను పెండ్లి చేసుకుంటా నన్నాడు. అమ్మకోపం జేసి తప్పంది. తరువాత చాటుగా పిలచి నన్ను అడిగాడు. అప్పుడు పెండ్లంటే నాకేమి తెలుసు, అదో ఆటనుకొని సరే నన్నాను...అవన్నీ జ్ఞాపకంచేశాడు. ఇద్దరం నవ్వుకున్నాం. నా శరీరం స్వాధీనంతప్పి పోతుంది. ఆజ్వాల ఆరడం కష్టమని

పిస్తోంది. ఆ శరీరపు వాంఛ కలిగిం తరువాత కాదనడం చాలాకష్టం. నా కష్టాలు నాభర్తవల్ల సౌఖ్యం అన్నీ ఆతనివద్ద యేకరువు పెట్టాను. మెల్లిగా, అతని భుజాలమీద, నా రెండు చేతులూ వేసి దగ్గరకు లాక్కొని, పెదవులు కలిపాను. సంబంధం స్థిరపడింది. ఇద్దరం ఆ గోడమీదనుండి లేచి మూలగా చేరాము అతడు కళ్ళల్లో ముఖంపెట్టి చూశాడు. అంతే! ఆ చూపే నా శరీరాన్నంతనీ లాక్కుంది, వశపరుచుకుంది; మత్తుపెట్టినట్టు నా మనసుని ఆతనివేపుకి తిప్పేసుకుంది. ఆకాశంమీద నక్షత్రాలు ధగాధగా మెరుస్తున్నాయి సంవత్సరం ఆరు మాసాలలోగా యెప్పుడూ యెరగని, పొందని, వూహించని, ఆనందం ఆ పదినిమిషాలు, అమూల్యంగా నా జీవితంలో మర్చిపోని సుఖాన్ని పొందేను...... యెవ్వరో హాల్లో లేచిన చప్పుడైంది......రహీం చప్పుననన్ను వదిలేసి వెళ్ళిపోయాడు. నేనుమెల్లిగా మెట్లు దిగి నా గదిలోకి వెళ్లిపోయాను.

ఆ వుదయాన్నే సరీగా మా ఆయన వచ్చారు. నావేపు యెగాదిగాచూచి, నోరు చప్పరించారు. నా శరీరపుశోభ ఆయన హృదయాన్నికూడా రగిలిస్తుంది కామోసు! చేతులుచాచి తన వడిలోకి రమ్మన్నాడు. నా కసహ్యమేసింది. యెందుకు వెళ్లాలి? ఆ కళ్లల్లో యెంతో కోరిక, ఆకలి కనపర్చాడు. అవేవీ నేను లెక్కచేయలేదు...ఆ...రోగిష్ఠి. పగలంతా యెంతో వుషార్‌గా తిరిగాను. యావ్వనులంతా నన్ను చూచీ నా అందాన్నిచూచి, శోభను చూచీ వోర్వలేక యీర్ష్యపడ్డారనుకుంటా; కాని నాకేంలెక్క? రాత్రి తమ్ముడిచేత ఆ అమ్మాయి మెడలో ఆ బ్రాహ్మడి సాహాయాన పుస్తి ముడివేయించాడు. మరదల్నీ తమ్ముణ్నీ గదిలోకి పంపి అంతా పండుకున్నారు నా గదితో మంచంమీద మాఆయన వున్నారు. నేను రహీంకోసం వెళ్లడమేలా? ఆయన్ని ఆలా గదిలోనే వుంచి బైట గొళ్లెం పెట్టి రహీం కోసం వెళ్లాను. అంతా తిరిగి చూచాను యీసందట్లో యెక్కడున్నాడో కనిపించలేదు. యీదుహోమంటూ మేడ మెట్లుదిగి చక్కా వొచ్చేశాను. ఆయనడిగారు యెక్కడికి షికార్ వెళ్లావని. నేనెక్కడికి వెళ్తే ఆయన కెందుకు? యేదో బొంకాను.

మధ్యాహ్నం ఫలహారం తీసుకుంటున్నాడు రహీం. నవ్వుతూ "రాత్రి పదకొండు" అన్నాను. అతను లేచి గబగబా నా ముందుకి వొస్తున్నాడు యేమిటీ కక్కుర్తి? నేను దబదబా మేడమెట్లు దిగి పోతున్నాను. అతను నా జల్తారు పైట పట్టుకున్నాడు. గప్పున నన్ను సందిట్లోకి లాక్కొని మెత్తని నా చెంప మీద ముద్దు పెట్టుకున్నాడు.

సాయంత్రం మరదలి కోసం గుచ్చిన మల్లిదండ వొకటి రహస్యంగా జాగ్రితచేసి, రాత్రి చక్కగా బట్టలు వేసుకుని, జడలో మల్లె పూలు అలంకరించుకుని గబగబా వెళ్లిపోయేను మేడమీదకి. ఆయన యేదో గొణుగుతున్నాడు. నే వినిపించుకోలేదు. నా కోసం రహీం యెదురు చూస్తుంటాడు. వినడానికీ, మాట్లాడ్డానికీ వ్యవధేది?

నన్ను అమాంతంగా సందిట్లోకి తీసుకుని. రహీం నా పెదవులమీద మృదువుగా ముద్దుపెట్టుకుని "ఇట్లు యెంత కాలంవరకు రహస్యంగా సుఖించడం?" అన్నాడు నవ్వుతూను. ఇంకా దగ్గరికి లాగుతూన్నాడు, నా నరాల తీవ్రత హెచ్చిపోతూంది. నన్ను యెంతో అప్యాయంగా మధురంగా ముద్దు పెట్టుకున్నాడు. శరీరమంతా ఝుల్లుమంది. వులుపు తిన్న నోరులా అయిపోయింది. యీ పవిత్ర ప్రేమకి యింకా యెన్నాళ్ళీ రహస్యపు సమావేశాలు? సంగతి సందర్భాలన్నీ పూసగుచ్చినట్లు చెప్పాను. వాడేలాగో యేడుస్తున్నాడు, అనుమానపడుతున్నాడు. మనం పెండ్లి చేసుగోరాదా? అన్నాను. ''వీల్లేదు; 'లా' అంగీకరించదు. మీ హిందువులలో మగాళ్ళే గాని స్త్రీలు మళ్ళీ మరొకర్ని చేసుకోవడానికి స్వాతంత్ర్యం లేదు. నీవు మతం పుచ్చుకుంటే మనం పెండ్లి చేసుకోవచ్చు" అన్నాడు రహీం. ''ఏల? రహీం! స్త్రీ మళ్ళీ పెండ్లి చేసుకోవడానికి వీల్లేదు? మగాడైతే యెంత మందినైనా పెండ్లాడచ్చు? స్త్రీకా స్వాతంత్ర్యం లేదు? యెనిమిది వేలు పోసికొన్నాం. మన చెప్పు చేతల్లో, హుక్కుభుక్తాల్లో మెలగవలసింది పురుషుడేగా! యేమంటావ్?"

అతని సౌఖ్యంకోసం భోగం దానితో వుంటూంటే సంఘం, 'లా' మాట్లాడవు? నా శరీర సౌఖ్యం కోసం

చాటునా మాటునా ...... యిద యితే సంఘం, 'లా' అంగీకరిస్తుంది గాని పబ్లిక్‌గా పెండ్లికి అంగీకరించరన్న మాట అంతేనా? మళ్ళీ స్త్రీ అర్ధాంగి అంటారే! మగాడు మరొకదాన్ని చేసుకోవడానికి అధికారం యిచ్చినపుడు అదే అధికారం స్త్రీకి మాత్రం లేకపోవాలి? నా యీ కాళ్ళు లేని నడుంలేని భర్తతో జీవించే దెలా? కాపురం చేసే దెలా? యీ సంఘం, 'లా' నాకు సౌఖ్యాన్ని ఆనందాన్ని కూరుస్తాయా? నిరుపయోగమైన, ప్రేమలేని ఆ భర్త నాకెందుకు?

రహీం, రా, నా మాటకి అడ్డు పెట్టకు, మరేమీ భయం లేదు. నా కట్నం డబ్బులతో బ్రతికే భర్త మనల్ని చేసేదేమిటి? యే మతానికీ సంబంధం లేకుండా పెండ్లి చేసేసుకుందాం యేంజేస్తుందో యీ సంఘం 'లా'నూ."

అతను నా మాటకి కాదనలేకపోయేడు.

అతను కేసు పెట్టాడు. రహీంతో చదువుకున్న వో స్నేహితుడు యీ కేసులో పనిచేస్తున్నాడు.

"నన్ను పెండ్లాడి రాత్రి ళ్ళు యింట్లో వుండక భోగం కొంపకు తిరుగుతూ నన్నెన్నో అవస్తలు పెట్టాడనీ, పెడుతూన్నాడనీ, పైగా సుఖరోగాలవల్ల నడుం, కాళ్ళు సరైన స్థితిలో లేవనీ చెప్పాను. క్రింది కోర్టులో ఆ శాస్త్రిలుగారు ఆయన పక్షంగానే తీర్పు చెప్పారు. అది తప్పని నేను అపీలు చేసాను. ఆ జడ్జి కూడా డిక్రీని బలపరుస్తూ అయన సేవ జేస్తూ, యిద్దరోమంటూ వుండాలని ఆలా కాకుంటే మనోవర్తి యేమీ యివ్వనక్కర్లేదనీ తీర్పు చెప్పారు. మళ్ళి పై కోర్టులో అపీలు పెట్టాను. రెండో జడ్జిమెంటులో మొదటి కోర్టుసితో నేసి, ఆమె భర్తవల్ల ఆమె సుఖపడ్డానికి వీలుందా అని, డాక్టర్ల చేత పరీక్ష చేయించవలసిందిగా చెప్పారు.

హిందూ ధర్మ శాస్త్రప్రకారం యిరువురూ, సమస్త సౌఖ్యాలూ, సమస్త స్వాతంత్ర్యాలూ, సరిసమానంగా పొందాలనీ అర్ధాంగి అంటే అదేననీ వుంది. ఆలాంటి దాంపత్యానికి వ్యతిరేకంగా ప్రవర్తించి, తన ఆరోగ్యాన్ని చెడగొట్టుకున్నాడు. యీ లేత వయిసులో యీతనివల్ల దాంపత్య సుఖానికి అవకాశం లేనపుడు అయన చెప్పు చేతల్లో వుండవలసిన అవసరమేమీ లేదు. పురుషుని చేతుల్లో స్త్రీ బానిసగా వుండాలని యెక్కడా లేదు. అలా వుండటం న్యాయ సమ్మతం గాదు. ఆమె మళ్ళీ పెండ్లి చేసుకోవడానికి తనతో బాంధవ్యాన్ని తెంచుకోవడానికిగాని ఆమెకి పూర్ణమైన హక్కు వుంది. పైగా అతనితో కూడితే ఆమె శరీరారోగ్యం కూడా పాడవుతుందని డాక్టర్లు చెప్తున్నారు. ఆలాంటపుడు ఆ స్త్రీమీద అటువంటి రోగిష్టి భర్తకి యేమాత్రం హక్కు లేదు. ఆమె యిష్టం వొచ్చిన మరో భర్తను పెండ్లి చేసుకోవచ్చును."

